

# బాద్దషి

ఘండికోట బ్రహ్మాజీరావు

రా కెలాకి రఘూర్పుగుడాకి మధ్యనొక స్టేషనుంది. ఆస్టేష ను లో ఒక గూడ్సు బండి పడితే, మేము రాత్రికి రాత్రి వచ్చి, వేగన్లను ఎత్తడం ప్రారంభించాం. ఆపని మరునాడు సాయంకాలం అయిదు గంటలవరకు జరిగింది. రైళ్ల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. పనివాళ్లు దగ్గిరలో నున్న గ్రామానికి టీ తాగడానికి వెళ్లారు.

నేనొక్కడినే ప్లాట్ ఫారమ్ మీదనున్న సిమెంటు బెంచి మీద కూర్చున్నాను. చిన్న స్టేషను - ప్లాట్‌ఫారమ్ మీద ఎవరూ లేరు. కొద్ది దూరంలో నున్న గ్రామం క్రమంగా చీకటి బడిలో దాగుంటున్నది.

ఏకాంతంగా కూర్చొని, సాయం సంధ్యలో ఆకాశం మీద మారుతున్న రంగులు చూస్తున్న నాక ఒక పిట్టకూత వినిపించింది. అది చాల దీనంగా ఉంది.

ఇంతలో స్టేషను నుండి చినమాష్టరు అటువేపే వచ్చాడు.

"రావుగారు ! మీరిలీఫ్ ట్రెయిను రాత్రి తొమ్మిది తరువాతే వెళ్తుంది. ఇక్కడ మీకు తోచకపోతే మాగది లో కూర్చోవచ్చు."

ఆపిట్ట మళ్లీ కూత పెట్టింది

"రావుగారు ! ఆ పిట్ట ఏం కూస్తున్నదో మీకు బోధపడిందా ? "

"బాధతో ఎవరో మూలుగుతున్న ట్లుంది"

"దానికో కథ ఉంది .వింటారా ! "

"తప్పకుండా"

చిన్న మాస్టరు చెప్పడం మొదలు పెట్టాడు

ఈ గ్రామానికి అప్పుడు మరో పేరుండేది. ఆ అప్పుడు అన్నది డెబ్బై సంవత్సరాల కిందటిది. గ్రామంలో ఉమాపతి మిశ్ర అన్న మహా పండితుడొకడుండేవాడు. ఆయన సంస్కృత సాహిత్యం మీద అనర్గళంగా ఉపన్యసించగల మహావక్త. అతనికి అరవై ఆరు సంవత్సరాలు. మనిషి మంచి వర్చస్వి. పండుతమలపాకు వంటి శరీరవర్ణం,అతనికి మొదటి భార్యవలన ఒక కొడుకు కలిగాడు. ఆమె పదిహేనేళ్ల కాపురం చేసి చనిపోయింది. రెండవ భార్య మరో పాతిక సంవత్సరాలు కాపురం చేసినా బిడ్డలను కనలేదు. రెండవ భార్య చనిపోయిన మూడు నెలల్లోనే అతని మూడో భార్య మంజరి కాపురానికి వచ్చింది. అప్పటికామె వయసు పదమూడేళ్లు.

కథ మధ్యలో చిన్న మాస్టరు నొక ప్రశ్నవేశాను.

"పెళ్లనెవరిచ్చారు, అంత వయసు మీరిన వాడికి?"

"ఎవరయినా యిస్తారు. ఆ కాలంలో ఈ పట్టింపులు లేవు. అన్నిటి కన్న, అతను చాల సంపదగలవాడు. పెళ్లినాటికి అతను చాల దృఢంగా ఉండేవాడు. మంజరి కూడా మరో సంపన్నుల గృహం నుండే వచ్చింది "

తరువాత అతను కథ చెప్పడం సాగించాడు.

గ్రామం చివర ఉమాపతిగారిల్లు ఉండేది. ఎకరం జాగాలో, పూల చెట్ల మధ్య, పళ్లచెట్ల మధ్యనొక పెద్దపూరిల్లు వారిది. చాల మంది శిష్యులు, ఆయింట నుండి, చదువు నేర్చుకున్నారు. మూడవ భార్య వచ్చిన తరువాత, లోకాపవాదానికి వెరచి, అతను మరే శిష్యులకు ఆశ్రయ మివ్వలేదు.

ఉమాపతి మిశ్రగారి కొడుకు వాచస్పతి. అతనికి ముప్పై సంవత్సరాలు. అతడు నిజానికి పండిత పుత్రుడు. చదువు సంధ్యలు అతనికి అంటలేదు. తమకున్న పాతిక ఎకరాల భూములను, రెండు మామిడి తోటలను అతను స్వయంగా చూసుకుంటున్నాడు. అతనికి వివాహమయింది. అతని భార్య కూడా పెద్ద యింటి నుండే వచ్చింది. ఆమె వయసు పాతిక సంవత్సరాలకు లోపే - ఆమె కూడా అందమయినదీ - మంజరితో ఆమెను పోల్చడం సరికాదేమో ! మంజరి చైత్ర పూర్ణిమవంటిది - ప్రియంవద కార్తీక పూర్ణిమ.

ప్రియంవద ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చింది. తన వినయవిధేయతలతో, సద్గుణాలతో, అత్తమామల ఆదరాన్ని, భర్త అనురాగాన్ని చూరగొంది. మంజరి తనకన్న చిన్నదైనా, అత్తగారి కివ్వవలసిన గౌరవమిచ్చి బాగా చూసుకొనేది.

ఒకరోజు ఉదయం మామూలుగా వాచస్పతి పొలాల మీదికి వెళ్ళిపోయాడు - ఉమాపతి మిశ్ర పక్కగ్రామానికి పోయి, సాయంకాలానికి తిరిగివస్తానన్నాడు. ఆవూరి స్త్రీలు, చెరువుకు పోయి, తాగే మంచినీళ్లు తెచ్చుకుంటారు. మామగారు ఆహితాగ్ని. మడి, ఆచారం అయింట తరాలనుండి పీఠం వేసుకొన్నది. అత్తగారు తనకన్న చిన్నది. కాబట్టి, ప్రియంవద తానే చెరువుకు పోయి, స్నానం చేసి నీళ్లు తెచ్చేది.

అత్తకు పదహారేళ్లు. ఆమె వయసుకు నాలుగు రెట్లు పైగా నున్నవారు మామగారు - ముదుసలి. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ చాల సహజమైంది. అత్త చేసిన తప్పు శారీరక దృష్ట్యా క్షమించదగినది.

ఆరోజు ఆమె కొన్ని బట్టలు కూడా ఉతకడానికి చెరువుకు తీసుకుపోయింది.

ఉదయం తొమ్మిది కావచ్చింది. ఒక యువకుడు ఉమాపతి గారి యింటి ఆవరణకు వేసిన తడకతలుపును తోసుకొని లోపలికి ప్రవేశించాడు. లోపలనున్న పూవుల అందాలను చూసుకుంటూ యింటివేపు నడిచాడు. వాకిటిలో నిలబడి కొంచెం బిగ్గరగా అన్నాడు.

"ఆచార్య ఉమాపతి మిశ్ర ! అభివాదనలు. నేను పూరీ నుండి వచ్చినశ్రీకంఠుడిని. పూజ్యపాదులను చైత్రశుద్ధ పంచమినాడు సన్మానించడానికి అటు మహారాజుగారు,. ఇటు పండిత బృందం సంకల్పించి....."

అంతవరకే అతను చెప్పగలిగాడు. అతని ఎదుటనో షోడశ వర్ష ప్రాయంలో నున్న సుందరి సాక్షాత్కరించింది. శ్రీ కంఠుడిని చూస్తూ చేష్టలు దక్కి నిలిచిపోయింది. విశాలమైన ఆమె కన్నులలో వింత కాంతులు - బింబాధరంపై మల్లెల వంటి చిరునవ్వులు - ఆ చూపులలో బలమైన కోరిక - ఆ పృథువక్షంలో కంపన - ఆ రంబోరువులలో సంచలనం - ఆమె చరణ లాక్షల్లో జలుగులు - ఆమె శరీరం వశం తప్పింది. అడుగులు వెనక్కు వేసింది ఆమె.

వెనక్కు అడుగులు వేసి పడక గదిలోకి పోయింది - శ్రీ కంఠుడు ఆమెను అనుసరించాడు. అతని చూపులు కామంతో నిండిపోయాయి. హఠాత్తుగా ఆమెను చేరి కౌగిలించుకున్నాడు. అంతకు రెండు రెట్లు బలంతో మంజరి అతనిని కౌగలించుకుంది. కిందటి జన్మలో, ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకొన్నట్లు వారు ఏకమయ్యారు. అనంగ మహాయజ్ఞంలో ఆ పడుచువాళ్లు సమిధలయ్యారు.

ప్రియంవద చెరువు నుండి ఆలస్యంగా యిల్లు చేరుకుంది. బిందెతో తెచ్చిన నీళ్లు తిన్నెమీద ఉంచింది. భుజం మీదనున్న తడిబట్టలను దండెం మీద ఎండవేసింది.

నుదుట కుంకుమ దిద్దుకుంది. తడిచీర మార్చుకోబోయి తన పడక గదివేపు చూసింది. ఆగది తలుపుల ఎడంగా నున్నాయి. పందిరి మంచం మీద, ప్రపంచాన్ని మరిచి, ఆనంద జలధిలో మునిగిన పడుచువాళ్ళను చూసింది.

ఆమె కీడు శంకించింది.

అత్తకు పదహారేళ్లు. ఆమె వయసుకు నాలుగు రెట్లు పైగా నున్నవారు మామగారు - ముదుసలి. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ చాలసహజమైనది. అత్త చేసిన తప్పు శారీరక దృష్ట్యా క్షమించదగినది.

కాని, ఈ ధర్మం ఎంతకఠినమైంది !దీని దృష్టిలో అత్త చేసిన పని క్షమించరాని మహానేరం.

మంజరి మత్తు నుండి పూర్తిగా తేరుకోలేదు. శ్రీకంఠుడు వెళ్లిన తరువాత అడుగులు మెల్లిగా వేసుకుంటూ పడకగది నుండి బయటికి వచ్చింది. కత్తివాటుకు కూడా ముఖంలో నెత్తురులేని కోడలి ఎదుట ఒక క్షణం నిలబడి తనగదిలోకి వెళ్లి పోయింది.

మిట్ట మధ్యాహ్నం - వాచస్పతి పొలాల

నుండి ఊరి వేపు నడుస్తున్నాడు - పొలంలో పని చేసి అలసిపోయాడు. అతనికి దారిలో ఒక పడుచువాడు ఎదురయ్యాడు. ఆయువకుడి చేతిలో ఒక దంతపు పెట్టె ఉంది. దాని మూతమీద కోణార్క దేవాలయంలో రథ చక్రం, శృంగార చిత్రాలు ఉన్నవి. ఈ అసాధారణమైన శిల్పం కోణార్కలో నున్న ఒకే శిల్పికి సాధ్యమవుతుంది. అతడు వాచస్పతి స్నేహితుడు - అతడు మిత్రుడికి బహూకరించిన పెట్టెవంటిది మరొకటి లేదు.




తన వస్తువును మరొకరి చేతిలో చూసి, వాచస్పతి సహించలేక పోయాడు.

"ఆగు ! ఈ పెట్టె నీకెక్కడిది ?" సూటిగా ప్రశ్నించాడు.

"నా ప్రియురాలు బహుమతిగా యిచ్చింది"

"ఎవరా ప్రియురాలు ? ఎందుకిచ్చింది?

"అనంగరంగంలో ఆమెను గెలిచానయ్యా ! తనశరీరాన్ని హృదయాన్ని సమర్పించిన సుందరి, ఈ దంతపు పెట్టె ఇవ్వడంలో ఆశ్చర్యమేముంది ?"

చండప్రచండుడయి వాచస్పతి యిల్లు చేరుకున్నాడు. వాకిట్లో నిలబడి గట్టిగా అరిచాడు.

"రండా ! పైకిరా ? నా దంతపు పెట్టె ఎవరికి బహూకరించావో చెప్పు!"

ప్రియంవద బయటికి వచ్చింది. నడివాకిట్లో వాచస్పతి ఆమె జుట్టు పట్టుకున్నాడు.

"ఓ పుంశ్చలి ! నిజం చెప్పు ! లేకపోతే ఈ కొడవలితో నీ నాలుక కోస్తాను"

పూర్వాపరాలు తెలిసిన ఆ గృహిణి, మరొక స్త్రీ గౌరవం కాపాడడంకోసం మౌనం వహించింది - వాచస్పతి అగ్రహోదగ్రుడయాడు - ఆపశువు, కొడవలితో ఆమె నాలుక కోసి వేశాడు. సాయం కాలానికి ఆమె శరీరం పంచభూతాలలో కలిసిపోయింది. ఉమాపతి కుటుంబం నాశనమయింది.

ఆ రాత్రి ఊరివాళ్లకో పిట్ట కూత వినిపించింది.

దుఃఖంతో నిండిన ఆ కూతలో రెండు విడి మాటలు వినిపించాయి.....

ఇంతవరకు చిన్న మాస్టరు చెప్పాడు - కంట్రోలులో ఎవరో పిలుస్తుంటే వెళ్ళిపోయాడు.

మళ్లీ ఆ కూత వినవచ్చింది.

ఒక అమాయకురాలు నిజం చెప్పడానికి వాక్కును కోరు కుంటుంది.

రైలొకటి దూసుకుంటూ పోయింది - దాని దీపకాంతులు బోర్డు మీదపడి స్టేషను పేరు కనిపించింది.

వాక్ దేవా - వాగ్దేహి - అదే బాగ్దేహి




